# యుగళ గీతం

అనసూయ ఆఫీసుకు అరగంట ఆలస్యంగా వెళ్ళింది. ఆలస్యం కాకుండా వెళ్ళాలని చాల ప్రయత్నం చేసింది. కాని ఆమె చేతకాలేదు. పెద్ద కుర్రాడు రెండు రోజుల నుంచి జ్వరంలో బాధపడుతున్నాడు. వాడిని కని పెట్టుకుని యింట్లోనే వుండిపోవలసిన మాట నిజానికి. కాని ఆఫీసులో సెలవు దొరికే పరిస్థితి లేదు.

అనసూయ బల్లదగ్గరకు చేరి కుర్చీలో కూలబడిందో లేదో బంట్రోతు వచ్చి చెప్పాడు - అయ్యగారు ఈపాటికి మూడుసార్లు పిలిచారని, ఆమెకు దాదాపు ఏడుపువచ్చినంత పనయింది. ఇప్పుడు లోపలకు వెళ్ళి ఆ అక్షం తలు వేయించుకుని మరీరావాలి. షార్ట్‌హాండ్ నోట్‌బుక్, పెన్సిలు చేతి లోనికి తీసుకుని కుర్చీలోంచి లేచింది. మేనేజరు గదికీ, ఆమె గదికీ స్ప్రింగ్ డోర్ అడ్డం. ఆ డోర్ తెరుచుకుని లోపలకు అడుగు వేసి భయం భయంగా 'గుడ్‌మార్నింగ్ సార్ !' అంది. మేనేజరు ఆమెవేపు ఉరుముతున్నట్లుగా చూచి – 'గుడ్ మాణింగ్ !' అన్నాడు లాంఛనంగా. అనసూయ ఆయనకు కుడిపక్కగా మేజా పక్కన నిలబడి అన్నది - 'నిన్న సాయంత్రం తీసు కున్న డిక్టేషన్ యింకా పూర్తిచేయలేదు సార్ ! ఇప్పుడే ఇంకో అరగంటలో పట్టుకు వచ్చేస్తాను. ఉదయం కాస్త ముందుగా రావాలని ప్రయత్నం చేశాను. కుదరలేదు సార్ ! క్షమించండి.' ఆయన అడగక ముందే తన పరిస్థితి నంతా చెప్పివేస్తే మంచిదని ఆమె అభిప్రాయం.

"నాకు తెలుసు అనసూయా, నీవు అవన్నీ పూర్తిచేయకుండానే ఇంటికి వెళ్ళావని. ఈ రోజు టపాకయినా అవి పంపకపోతే యింక ఈ ఆఫీసులో నువ్వూ నేనూ వుండక్కర్లేదు. ఎంచక్కా యింటి దగ్గరే వుండి పిల్లాపాపల్ని చూచుకుంటూ కూర్చోవచ్చు' అన్నాడు ఆయన కాస్త వ్యంగ్యం

వెటకారం విళాయించి. అనసూయ దిగమింగడం తప్ప ఇంకేమీ చేయలేక పోయింది.

అనసూయ ప్రస్తుతానికి గండం గడిచిందని లోలోపలే నిట్టూరుస్తూ తన గదిలోకి వచ్చింది. 'ఏమిటో ఈ వెధవ జీవితం' - అని విసుక్కుంది.

పేరుకు ఉద్యోగం చేస్తున్నాను గనుక, స్వతంత్రంగా జీవిస్తున్నానని పేరేగాని ఎన్నిరకాల బానిసత్వానికి లోబడవలసి వస్తుందో తనబోటిదానికి తప్ప యింకెవరికీ తెలియదు.

అనసూయ టైపు మెషిన్‌లో కాయితాలు దూర్చింది. నోట్ బుక్ వంక ఒకసారి చూచుకుంది. పేజీల సంఖ్య లెక్క పెట్టుకుంటే కళ్లు తిరిగిపోతాయి. చేతులు యిప్పుడే మొద్దుబారిపోతాయి. ఏమీ చూడకుండా, యేమరుపాటు లేకుండా గుడ్డిగా పని చేసుకుంటూ పోతేనే సాధ్యమయినంత త్వరగా అయిపోతుంది. లేకపోతే మీనమేషాలు లెక్కపెట్టటంతోటే సరిపోతుంది సమయం అంతా. మనస్సు చికాకుగా వున్నప్పుడు పనిలో ఎక్కువ తప్పులు వస్తాయి. అర్జెంటు రిపోర్టులో తప్పులు వస్తే యింకేమయినా వుందా? తన చదువుకూ చాకచక్యానికీ మచ్చ మాత్రమే కాకుండా వెంటనే ఉద్వాసన జరిగినా ఆశ్చర్యం లేదు. ఇట్లా భయపడుతూ యే క్షణంలో యేం జరుగుతుందో అని బెరుకుపడుతూ యేం పని చేస్తుంది?

అనసూయకు రోజూ యిలా భయంలేదు. పని అంటే అస్సలులక్ష్యం లేదు. ఎంత పని అయినా అవలీలగా ఎడమచేతితో చేసిపారేస్తుంది. ఒక పూటంతా పడుతుంది అనుకున్న పనిని, అతిచక్కగా గంటలోనే ముగించి మేనేజరు ముందుపెట్టి ఆయన మెప్పుపొందిన రోజులు ఎన్నయినావున్నాయి. ఒక రోజు మెప్పు పొందాము గదా అని తరువాత తాపీగా కూర్చోవటానికి లేదు. ఈ ఉద్యోగాలు ఎప్పటికప్పుడు పరగడుపే. నిన్నటి పుణ్యం ఈవేళ రక్షించదు. ఇవాళటి పాపం రేపటిదాకా ఆగదు.

మేనేజరును ప్రస్తుతానికి శాంత పరచటానికి "అరగంటలో తెస్తాను" అన్నదే గాని, ఎంత త్వరగా చేసినా యిదంతా మూడుగంటలలోపుగా తెమిలే వ్యవహారం కాదని ఆమెకు క్షుణ్ణంగా తెలుసును. అయితేనేం-ఎప్పటికి యేది ప్రస్తుతమో ఆ మాటలు పలకకపోతే రోజులు గడవవు.

అనసూయ మనసులో ఆలోచనలు రకరకాలుగా ముసురుకుంటున్నాయి. వేళ్ళుమాత్రం యాంత్రికంగా టైప్ మిషిన్‌మీద పనిచేస్తున్నాయి-కళ్ళు నోట్సువయిపు టైపు అవుతున్న కాగితాల వయిపు లయబద్ధంగా నాట్యం చేస్తున్నాయి.

స్ప్రింగ్‌డోర్ తెరుచుకుని మేనేజర్ ఆమె గదిలోనికి వచ్చాడు. ఎంతో అర్జెంట్ అయితేతప్ప ఆయన అలారాడు. ఆ సంగతి అనసూయకు తెలుసు. ఆయన్ను చూడగానే లేచి నిలుచుంది. "కూర్చో, కానీ—మర్యాదలు తరువాత—ముందు అయినంతవరకు కాగితాలు నాకు యిచ్చెయ్యి. చూస్తూవుంటాను" అంటూ ఆయన మూడుపేజీలు పుచ్చుకు వెళ్ళాడు. వెళ్లుతూ "యింతేనా? మూడేనా?" అన్నట్లుగా అనసూయ వయిపు చూచాడు. ఆమె గడియారం వయిపు చూచుకుంది అబ్బ! పెద్దవాడికి మందుయివ్వవలసిన టైమ్. ఆయనకు గుర్తువస్తుందోరాదో. తనపాటికి తను ముందుగదిలో కూర్చుని సిగరెట్లు కాలుస్తూ ఆలోచించుకుంటూ వుండిపోతారేమో! టైముకు మందు పడకపోతే పిల్లవాడికి ఆరోగ్యం చేకూరేదిఎలా? అక్కడికీ ఆయనకు అన్నీ గుర్తుచేసి ఒక కాగితంమీద మందు మోతాదులు, టైములు వ్రాసియిచ్చి వచ్చింది ఆయన, అసలు పరధ్యాస మనిషి. తన ఆలోచనలు యేమో తనేమో తప్ప యింటివిషయాలు పట్టించుకోడం, అంతా బాగానే వున్నప్పుడే అంతంతమాత్రం, ఇప్పుడువేరే చెప్పాలా? ఒక్కసారి యింటికివెళ్ళి కుర్రవాడి మందువిషయం చూచుకుని చటుక్కున వచ్చివేద్దామా అనిపించింది ఆమెకు. పదిహేను నిమిషాలలో వచ్చేయవచ్చు. కాని, మేనేజరు ఆయనకు! తెలిస్తే యింకేమయినా వుందా! ఆయనకు

తెలియకుండా తను యీ గదలోనుంచి కదలడం ఎలా? ఎ క్షణంలో అయినా ఆయన యిక్కడకు రావచ్చు. ఛీ ఛీ—అనిపించింది అనసూయకు. మనసు అంతా పిల్లవాడిమీద పెట్టుకొని, మనిషిమాత్రం యిక్కడ టైప్ మెషిన్ ముందుమగ్గిపోవాలి,

ఈ కాగితాలు పూర్తిచేయడం తరువాతనయినా ముక్తి దొరుకుతుందోలేదో. మళ్ళీ ఈరోజు టపాలో యింకేం జరూరు పనులో ఎవరికి తెలుసు? ఎప్పటికప్పుడే తొందర. అయినంతవరకూ మింగేద్దామనే అందరికీని. ఇందాక మేనేజరు, అయినంతవరకు యివ్వు అన్నప్పుడు అనసూయకు లీలగా గుర్తువచ్చింది, తన భర్త అయినంతవరకూ తినేసి బయటకు వెళ్ళిపోతూ వుంటాడు. ఏదయినా అర్జంట్ పని వున్నప్పుడు: వంట పూర్తి అయేంతవరకూ వుండడం కుదరదు, పాపం: తను కుటుంబం జరుపుకు రావడంకూడా అయినంతవరకు మాత్రమే చేస్తూవుంటుంది. "అయినంతలోనే" అంటూ తను యీ పెళ్ళి చేసుకుంది, ఈ సంసార జంఝాటాన్ని తగిలించుకుంది. ఈ ఉద్యోగంలో చేరింది. చూడగా చూడగా ఈ ప్రపంచంలో అందరూ అయినంతలోనే సర్దుకు కూర్చోవటానికి తయారుగా వున్నారు అనిపిస్తుంది.

మేనేజరు మళ్ళీ వచ్చాడు. "రెండోపేజీలో జాస్తితప్పులు వచ్చాయి. అంతేకాదు. ఒక వాక్యం తిరగరాశాను కూడా. మళ్ళీచెయ్యి" అన్నాడు. నయంమూడు పేజీలు తన ముఖాన తిప్పికొట్టినందుకు సంతోషించింది. మళ్ళీ నాలుగు కాగితాలు చేతిలో పట్టుకుని ఆయన తన గదిలోనికి నిష్క్రమించాడు. అనసూయ గడియారం చూచుకుంది. రెండోపిల్ల బడినుంచి ఇంటికి వచ్చే సమయం, పొద్దున యేమీ తినకుండా వెళ్ళింది. అది తినకుండా వెళ్ళడం యేమిటి. తను యేమీ పెట్టకుండా పంపించింది. రెండు చాక్లెట్ లు మాత్రం యిచ్చింది. చాక్లెట్ల తీపిలో పిల్ల ఆకలికూడా మరచిపోయి పుస్తకాలు పట్టుకుని బడికి పరుగుతీసింది. పిచ్చిపిల్ల: ఆవురావురు అంటూఅది

యింటికివస్తే ఆయనకాస్త సముదాయించి అన్నం పెడతారో లేదో: 'నువ్వే పెట్టుకుతిను!' అంటే చిన్నపిల్ల-దానికేం చేతనవుతుంది-అంతా ఎంగిలి మంగలంచేసి పడేస్తుంది. ఆయనగారికి సిగరెట్లు అయిపోతే, కొనుక్కురావ డానికి అంటూ బయటకు వెళ్ళలేదుకదా! ఇల్లు వదిలి బయటకు వెడితే, యింకేమవుతుందో ఆయనకు తెలియదు.

బంట్రోతు టీ తీసుకువచ్చి బల్లమీద పెట్టాడు. ఆమె ఒక్క క్షణం పనిఆపి కప్పు చేతిలోకి తీసుకుంది. ఆయనకుకూడా ఇదే టీ సమయం. ఫ్లాస్క్‌లో పోసిపెట్టాను గుర్తుపెట్టుకుంటారో లేదో లేక అలా యదాలా పంగా పడక కుర్చీలో వాలిపోయి వుంటారో-అనుకుంది. తను రాసి పెట్టి వచ్చిన చీటీలో 'టీ' సమయంకూడా ఉదహరించింది. ఆయనగారు చూడాలిగదా-కర్మ.

'మెయిన్ రిపోర్టు' టైప్ చేయడం అయిపోయింది. ఇంక స్టేట్ మెంట్లు - ఉపరిపోర్టు తయారుచేయాలి. నిజానికి ఇవే ఎక్కువ సమయం పడతాయి. యంత్రాలలాగ పని చేసుకుంటూ పోవలసిందేగదా!

మేనేజర్ రిపోర్టు అంతా చూచాడు. బాగానే వుందన్నాడు. తతిమా పనికూడా వెంటనే లాగివేస్తే 'లంచ్'కు వెడదాం అన్నాడు. అనసూయ అవి ఎవరి చేతులో అన్నట్లుగా టకటక పని చేసుకుంటూ పోతోంది. నిన్న మటుకు నిన్న తను యెంతో ఆలస్యంగా యింటికి వెళ్ళింది. కాస్తముందుగా వెళ్ళి డాక్టర్ దగ్గరకు తీసుకు వెళ్ళినట్లయితే రాత్రంతా వాడు అంత బాధ పడేవాడు కాదు. ఈ రోజు అంత తీవ్రత వుండేది కాదు. డాక్టర్ యేమం టాడు? 'ఏం భయం లేదమ్మా! పొట్టి జ్వరమే, మీరేం దిగులు పెట్టుకో కండి. నాలుగు రోజుల్లో అదే తగ్గిపోతుంది'. ఆయన చెబుతున్నది నిజమే కావచ్చు. అయితే ఈ నాలుగు రోజులు ఎలా గడుస్తాయన్నది తనకు చేరిన

సమస్య. పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటంలాగ వుంది తనపరిస్థితి. ఎవరు పిల్లి? ఆఫీసు, యిల్లు, తరగని బాధ్యతలు, మరిచిపోలేని బరువులు, వేదనలు యివన్నీనా?

ఎన్నో బాధలు; వాటిని అనుభవించడంలోనే తెలిసీ తెలియని తీయని బాధ. జ్వరంతో వున్న కొడుకుకు పళ్ళరసం తీసి యిస్తుంటే ఎంతో మమ కారం పొంగి పొర్లుతూ ఉంటుంది అమృతం చిలికి వాడికి అందిస్తున్న ట్లుగా వుంటుంది. తన మనస్సుకు అట్లా రసం తన చేతులతో యివ్వలేక పోయిననాడు - యేదో దిగులుగా భయంగా తప్పుచేస్తున్నట్లుగా వుంటుంది. జ్వరం తగ్గి కుర్రాడిని మళ్ళీ సినిమాకు తీసుకువెడితేగాని తన మనస్సుకు తేలి కగా వున్నట్లు కాదు. జ్వరంలో వాడికి బడిపాఠాలన్నీ పోతాయి. అవన్నీ దగ్గర కూర్చోపెట్టుకుని తనే చెప్పాలి. లేకపోతే వాడు బడిలో వెనకపడి పోతాడు. జ్వరం తగ్గిపోయింది గదా అని పాఠాలన్నీ ఒక్కమారుగా నూరి పోయడానికి వీలులేదు. ఏమాత్రం శ్రమ ఎక్కువయినా జ్వరం తిరగబెడు తుంది. తనకు తీరుబడి వుండాలి. వాడికి నిద్ర రాకుండా వుండాలి. మన సుకు అలసటలేకుండా వుండాలి. అలా నాలుగురోజుల పాఠాలు తను ఇంటి దగ్గర పూర్తి చేయాలంటే దాదాపు నెలరోజులు పడుతుంది. ఏమిటో అన్నీ లెక్కలు తను చాల నిక్కచ్చి మనిషి. అన్నీ ముందుగా చక్కగా అంచ నాలు వేసుకుని చూచుకుంటుంది. అంతా 'ప్లాన్' ప్రకారం నడుపుకు పోవాలని చూస్తుంది. కాని ఎక్కడో ఏదో పొరపాటు వస్తుంది. ఎవరో సమయానికి చిక్కకుండా పోతారు. అన్నమాట ప్రకారం చేయరు. దాంతో అంతా తలక్రిందులయి పోతుంది. అనసూయకు తల తిరిగిపోయినట్లే అయిపోతూంది.

అనసూయ చివరి పేజీ టైప్ చేసి తనే స్వయంగా మేనేజర్ గదిలోకి వెళ్ళింది. 'అయిపోయిందమ్మా!' అన్నాడు, ఆయన ఆప్యాయత వొలక

బోస్తూ. పాపం ఆయన మాత్రం యేం చేస్తాడు? ఆయన ఒకరికింద నౌకరే కదా. తననేం కావాలని హింసపెట్టటం లేదు కదా - అని సమాధానపరచుకుంది అనసూయ.

ఆయన కాగితాలన్నీ సర్ది చూసుకుంటూ మధ్యలో గడియారం వంక చూచి 'లంచ్ టైం బాగా దాటిపోయింది. మీరు యింటికి వెళ్ళి భోజనం చేసి పది నిమిషాలలో వచ్చేయండి. తరువాత దీనికి అంత్యక్రియలు చేసి వేసి - ఈ రోజు పని ప్రారంభం చేద్దాం' అన్నాడు. మనస్సులోనే నిట్టూర్చుకుంటూ బయటపడింది.

మళ్ళీ తను పదినిమిషాలలో వచ్చివేయాలి. అనసూయ చకచక యింటికి వెళ్ళింది. ఇల్లంతా ఒకమారు కలయచూచుకుంది. అంతా తను అనుకున్నట్లుగానే అసంపూర్తిగానే వున్నాయి పనులు. అన్నీ తీర్చిదిద్దుకుని భర్తగారికి భోజనం పెట్టేసి తనూ నాలుగు మెతుకులు నోట్లోవేసుకుని, పిల్లలకి, భర్తకి చెప్పాల్సిన మాటలు చెప్పేసి చేతిసంచి తీసుకుని ఆఫీసుకు పరుగుతీసింది.

'అయ్యగారు మిమ్మల్ని రాగానే రమ్మన్నారు' అన్నాడు బంట్రోతు మామూలుగా.

'రండి, కూర్చోండి' అన్నాడు మేనేజరు. నీరసంగా కూలబడింది అనసూయ. మేనేజరు ఆమెవేపు ఒక కాగితం జరిపాడు. 'చదవండి' అన్నాడు. తనకు ఉద్వాసన కాదుగదా - అని ఒక్కక్షణం కలవెళపడింది అనసూయ. ముఖంమీద పట్టబోతున్న చెమటలను తుడుచుకుంటూ చదివింది - ఆ కాగితం హెడ్ ఆఫీసునుంచి మేనేజరుకు వచ్చిన తాఖీదు. 'ఫలానా రిపోర్ట్ పంపవలసిన తేదీ దాటిపోయి వారంరోజులయింది, చూడు. ఫలానా తారీకుకు అది మా ఆఫీసుకు జేరకపోతే యేంచేస్తామో' అని దాని సారాంశం. చేతులన్నీ పచ్చిపుళ్ళు అయేలా టైప్‌చేసింది ఆ రిపోర్టే.

'చూడండి, ఇటువంటి ఉత్తరం రాకుండానే రిపోర్ట్ ఫైనలైజ్ చేయాలని ప్రయత్నించాను, నావల్ల కాలేదు. మనకు సమాచారం అందించ వలసిన వాళ్ళు చురుకుగా పనిచేయరు. వాళ్ళమీద మనకేమీ అధికారం లేదు. అంతా తయారుచేసుకునేసరికి ఇంత ఆలస్యం ఎలాగూ అవుతుంది. ఇటువంటి ఉత్తరాలు యింకో రెండు వస్తే నాకు డిప్రమోషన్, యింకేదో అరణ్యప్రాంతానికి బదిలీ - తప్పదు. అందుకనే మిమ్మల్ని ఈ రెండు రోజులూ యింత శ్రమపెట్టాను, అయినా ఫలితం దక్కలేదు '

'నా శ్రమకేం లెండి, చేయవలసిన పని చేశాను. నేను నిన్ననే టైప్ చేసివుంటే బాగుండేదేమో!' సణుగుతున్నట్లుగా అంది అనసూయ - అది అసాధ్యం అని తనకు తెలిసికూడా.

'మీ స్వంత యిబ్బందులు ఎలాంటివో నాకు తెలుసు. అయినా మిమ్మల్ని యిబ్బంది పెడుతున్నాను క్షమించండి' అన్నాడు మేనేజర్ మళ్ళీ అనసూయ హృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. ఆయన కాళ్ళకు వొంగి నమస్కారం చేయాలనిపించింది. 'అట్లా అనకండి. పెద్దవారు' అంది తమాయించుకుని.

'చూడండి. హెడ్ ఆఫీసుకు టెలిగ్రాం పంపించండి - రిపోర్ట్ ఈ రోజే ఎయిర్-మెయిల్ చేస్తున్నామని. కాగితాలన్నీ సంతకం చేసేశాను. పాక్‌చేసి ఎయిర్‌పోర్ట్‌కు పంపండి. తరవాత కాఫీతాగి తాపీగా రండి. ఇవాళటి కాగితాలు చూచుకుందాం' అన్నాడు.

అనసూయ లేచి తనగదిలోనికి వచ్చింది. పనిలో మునిగిపోయింది. మేనేజర్, పాపం మంచివాడు. తనకష్టం ఆయనకు తెలుసును కాని యేం చేస్తాడు? ఆయనకుమాత్రం మతి స్తిమితంలేని భార్యను, పక్కమీదనుంచి లేవ లేని తండ్రిని చూచుకొంటూ యింటిదగ్గరే వుండిపోవాలని వుండదూ? కాని

అదంతా కుదిరే పనేనా? జీవితంలో ఎంత వద్దనుకున్నా ఎన్నో రాజీలు, సర్దుకుపోవటాలు నేర్చుకోవాలి. లేకపోతే బతుకు మరింత భయంకరం అయిపోతుంది. ఉద్యోగం తెచ్చిపెట్టే నాలుగురాళ్లూ లేకపోతే ఎవరికి మాత్రం రోజులు సజావుగా నడిచిపోతాయి? చేతినిండా పని, మనసునిండా ఆలోచనలతో మునిగిపోయి కూడా అనసూయ పెదవులమీదికి చిరునవ్వు తెచ్చుకుంది. *

(ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక)